## క్లుప్తంగా

### ఐటీఐ, ఏపీఆర్‌జేసీలకు ఉచిత కోచింగ్

మాచర్ల: నియోజకవర్గంలో 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ సేవా సమితి సభ్యుడు మెట్టు గోవిందరెడ్డి కోరారు. ఐటీఐ, ఏపీఆర్‌జేసీలకు గణితం, సైన్స్ సబ్జెక్ట్‌లలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే కోచింగ్ ఇస్తామన్నారు. ఈ కోచింగ్ ఏప్రిల్ 1వ తేదీ నుంచి 24 వరకు నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10గంటల వరకు అదేవిధంగా సాయంత్రం సమయంలోనూ కోచింగ్ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఉచితంగా ఎంట్రన్స్ పుస్తకాలు అందిస్తామన్నారు. స్వామి వివేకానంద స్టూడెంట్ హోం, శ్రీశైలం రోడ్డులోని కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ నిర్వహించటం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9440006813, 9346162835 నంబర్లను సంప్రదించాలన్నారు.

### ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ



దాచేపల్లి: ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని తహసీల్దార్ పి.గీతావాణి అన్నారు. ఓటు హక్కు వినియోగంపై శనివారం దాచేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ గీతావాణి మాట్లాడుతూ... ధృడమైన సమాజం కోసం ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. ఓటు ద్వారా మనకి నచ్చిన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉందని, ఓటు వేయటం బాధ్యతగా తీసుకోవాలని ఆమె చెప్పారు. కమిషనర్ డీవీఎస్ నారాయణ రావు, డిప్యూటీ తహసీల్దార్ రాజు, బీఎల్వోలు పాల్గొన్నారు.

### వాహనాలు తనిఖీ



మాచర్ల: పట్టణంలో ఆర్టీసీ సంస్థతో కలిసి మాచర్ల మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శేషురెడ్డి శనివారం సాగర్ రోడ్డులోని ఆర్టీసీ గ్యారేజీ వద్ద పలు వాహనాలు తనిఖీ చేశారు. సుమారు 3గంటల పాటు వాహనాలు తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రాలు లేనివారి నుంచి అపరాధ రుసుము వసూలు చేశారు.

### భక్తాంజనేయ దేవస్థానానికి మంచినీటి సౌకర్యం

సత్తెనపల్లి: వేసవిని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యార్థం పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసియున్న భక్తాంజనేయ స్వామి దేవస్థానానికి మంచినీటి సౌకర్యం కల్పించేందుకు గరే చంద్రశేఖర్ మారుతి శ్రీనివాసు నాగేశ్వరి దంపతులు ముందుకు వచ్చారు. దేవస్థానంలో మంచినీటి బోరు, మోటారు, వాటర్ ట్యాంకర్ తదితర వాటికి రూ.70 వేలు వెచ్చించారు. ఈ సందర్భంగా శనివారం భక్తాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ, ఛత్రపతి శివాజీ యూత్ కమిటీ సభ్యులు దాత దంపతులను పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఛత్రపతి శివాజీ యూత్ కమిటీ సభ్యులు ఉన్నారు.

### పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

క్రోసూరు: క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న మూడు సంవత్సరాల ఇంజినీరింగ్ కోర్సులు, నాన్ ఇంజినీరింగ్ కోర్సుల ఎంట్రన్స్ పరీక్షకు(పాలిసెట్)సోమవారం నుంచి ఉచితంగా కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ బీవీ రమాదేవి శనివారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగుతులు జరుగుతాయన్నారు. ఉచితంగా స్టడీ మెటీరియల్, నమూనా పరీక్షల నిర్వహణ జరుగుతుందన్నారు. ఎంట్రన్స్ పరీక్షకు ఏప్రిల్ 5 వతేదీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాలలో ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు. పదవతరగతి పాసైన వారు, పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పాలిటెక్నిక్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. క్రోసూరు, చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమాదేవి కోరారు.

### గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అమరావతి: స్థానిక అమరేశ్వర ఘాట్ సమీపంలో కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం అమరేశ్వరాఘాట్ వద్ద గల పంప్‌హౌస్ సమీపంలోసుమారు 35 సంవత్సాల వయసు గల వ్యక్తి మృతదేహన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అమరావతి పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించారు. ఈసందర్భంగా సీఐ వి.వి. బ్రహ్మం మాట్లాడుతూ మృతుడు పసుపురంగు గీతలు కల్గిన టీ షర్టు, ఆర్ఆర్ కంపెనీకి చెందిన నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడన్నారు. గుర్తించిన వారు 9440796217, 944079266 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# బతుకు బండికి ఊతం

**వాహన మిత్రోత్సాహం**

- ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేల చొప్పున సాయం
- నియోజకవర్గవ్యాప్తంగా 1,594మంది డ్రైవర్లకు రూ.5.19 కోట్ల సాయం
- సీఎం జగనన్నకి రుణపడి ఉంటామన్న డ్రైవర్లు



దాచేపల్లిలో ఆటో నడుపుతున్న డ్రైవర్

దాచేపల్లి: రోడ్డుపై ఆటోలు.. ట్యాక్సీలు నడుపుకొనే వారు గౌరవంగా బతుకుతున్నారు. గత ప్రభుత్వాలు ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లను గుర్తించకపోవటంతో ఎన్నో ఇబ్బందులు పడి అప్పుల పాలయ్యారు. వాహనాలకు సంబంధించిన పర్మిట్లు, ఇన్సూ్యరెన్స్, బ్రేక్, పొల్యూషన్ చేయించాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో, ట్యాక్సీ, క్యాబ్‌లను నడుపుకొని జీవనం సాగించే డ్రైవర్ల తలరాతలు మారాయి. ముఖ్యమంత్రివ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10వేల చొప్పున చెల్లిస్తుండటంతో కాలర్ ఎగరేసుకుని వాహనాలను నడుపుకొంటున్నారు. 2019 అక్టోబర్ 14న వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని సీఎం జగన్ ప్రారంభించటంతో ఆటోలు, ట్యాక్సీలు, క్యాబ్‌లకు అన్ని రకాల అనుమతులు తీసుకుని దర్జాగా నడుపుకొంటున్నారు.

**నాలుగేళ్లలో రూ.5.19కోట్ల లబ్ధి..**

వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా నాలుగేళ్లలో 1,594 మంది లబ్ధిదారులకు రూ 5,19,80,000లు లబ్ధి జరిగింది. పిడుగురాళ్లలో 678 మంది, దాచేపల్లిలో 329, మాచవరం 285, గురజాలలో 302మంది చొప్పున ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకి ఏడాదికి రూ.10వేల చొప్పున నేరుగా బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేసింది.

### జగనన్న సాయం మాకు వరం..



వైఎస్సార్ వాహనమిత్ర పథకం ఆటో, కారు డ్రైవర్లకు వరంగా మారింది. నేను 25ఏళ్లుగా తక్కెళ్లపాడులో ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాను. ప్రతి ఏడాది ఆటో ఇన్సూ్యరెన్స్, పర్మిట్, బ్రేకు కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. జగనన్న సీఎం అయిన తరువాత మాకు ఏడాదికి రూ.10వేలు ఇవ్వటం వరంగా మారింది. ఈ నాలుగేళ్లలో ఆటో బ్రేకు, పర్మిట్, ఇన్సూ్యరెన్స్ కోసం రూపాయి కూడా అప్పు చేయకుండా జగనన్న ఇచ్చిన డబ్బులనే కట్టాను. ఇటువంటి మంచి పథకం బహుశ దేశంలో ఎక్కడా లేదు.

– చాప అప్పారావు, తక్కెళ్లపాడు

### ఆర్థిక భరోసా కల్పించారు



గత 13 ఏళ్ల నుంచి కేసానుపల్లిలో ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాను. నాకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నేను ఫైనాన్స్‌లో ఆటో తీసుకుని నెలనెలా కిస్తీలు కట్టుకుంటున్నాను. ఈ క్రమంలో సంవత్సరానికి ఒకసారి నా ఆటో ఇన్సూ్యరెన్స్, బ్రేకు, పొల్యూషన్, పర్మిట్‌ల కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత నాకు వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా గత నాలుగేళ్లుగా ఏడాదికి రూ.10వేల చొప్పున రూ.40వేలు వచ్చాయి. జగనన్న ఇచ్చిన డబ్బులతో బ్రేకు, ఇన్సూ్యరెన్స్, పొల్యూషన్, పర్మిట్‌లకు కట్టుకున్నాను. ఆర్టీఓ అధికారులతో నాకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఉంది.

– చెట్టిపోగు రవికుమార్. కేసానుపల్లి

### జగనన్న భరోసా ఇచ్చారు..



నేను గత 20 ఏళ్లుగా ఆటోనడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాను. గత ప్రభుత్వంలో ఆటోతో కుటుంబాన్ని పోషించటం కష్టంగా ఉండేది. కొన్నిసార్లు ఆటో ఇన్సూ్యరెన్స్, బ్రేకు, పర్మిషన్ల కోసం డబ్బులు లేక ఇబ్బందులు పడి ఆటోని నడపకుండా ఇంట్లో పెట్టేవాడిని. జగనన్న సీఎం అయిన తరువాత ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10వేల చొప్పున ఇస్తున్నారు. నాకు ప్రతి ఏడాది వస్తున్న వాహన మిత్ర డబ్బులతో ఆటో ఇన్సూ్యరెన్స్, బ్రేకు, పర్మిషన్లు తీసుకుంటున్నాను. మాకు జీవనాధారమైన బతుకు బండికి జగనన్న ఆర్థిక భరోసా కల్పించారు.

– జానకి నరసింహారావు, దాచేపల్లి

# వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

**ప్రభుత్వ విప్ పీఆర్కే**



పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న పూజల రామయ్య

రెంటచింతల: పల్నాడు జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులతో కలిసి కృషి చేయాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు పూజల రామయ్యను జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు శనివారం ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నియామక పత్రాలను పూజల రామయ్యకు అందజేసి మాట్లాడారు. పార్టీని నమ్ముకున్న వారికి ఎప్పటికైనా తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న రామయ్యకు పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు. పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉన్నవారికి తాము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. పూజల రామయ్య మాట్లాడుతూ తనకు పార్టీలో కీలక పదవి కేటాయించడానికి కృషి చేసిన ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో మాచర్ల నుంచి వరుసగా 5వ సారి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషి చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి మండలంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన పూజల రామయ్యను ఎంపిక చేసి పార్టీలో సముచితస్థానం కల్పించడంపై పార్టీ నేతలు, శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, బుగ్గల సైదా తదితరులున్నారు.

# కేసానుపల్లిలో 'రన్ ఫర్ జీసస్'




రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దాచేపల్లి: ప్రతి ఒక్కరూ క్రీస్తు ప్రేమను చాటాలని పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి లూథరన్ చర్చి ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. కేసానుపల్లి నుంచి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. క్రీస్తుని చేరేంతవరకు అలుపెరగకుండా పరుగెత్తాలన్నారు. క్రీస్తు బోధించిన మార్గాన్ని ఆచరించాలని, జీవితంలో ఎన్ని ఇబ్బందులు, కష్టాలు, కన్నీరు వచ్చినా ఎడతెగక ప్రార్థన చేసి ప్రభువును చేరుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, సంఘ పెద్దలు వినుకొండ సుధీర్‌కుమార్, మీసాల ఏసుదాసు, వినుకొండ యాకోబు, శ్రీపతి లింగయ్య, మీసాల యిర్మియా, మీసాల అచ్చయ్య పాల్గొన్నారు.

**మాచర్లలో...**

మాచర్ల: ఏసుక్రీస్తు బోధనలను నిత్యం అనుసరించి నిత్య జీవనాన్ని పొంది ఆయన యందు విశ్వాసముంచిన ప్రతి ఒక్కరికీ ప్రభువు ఆశీస్సులుంటాయని పల్నాడు దైవ సేవకుల సహవాసం అధ్యక్షులు పాస్టర్ జాన్ వెస్లీ అన్నారు. శనివారం ఉదయం రింగురోడ్డు సెంటర్ నుంచి బస్టాండ్ వరకు సువార్త ర్యాలీ(రన్ ఫర్ జీసస్) నిర్వహించారు. సీనియర్ పాస్టర్ దేవభిక్షం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించగా పాస్టర్ లాజర్ అధ్యక్షత వహించారు. పట్టణంలో వందలాది మంది పాస్టర్లు, దైవ సేవకులు, విశ్వాసులు పాటలు పాడుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ సేవలు భూషణం, మేడి యాకోబు, కార్యదర్శి ప్రసాద్, పాస్టర్లు మార్కు, ఎలీషా, జాయ్, ఇశ్రాయేలు, కె.వెంకయ్య, బ్రహ్మానాయుడు పాల్గొన్నారు.

# కాపీ మేనిఫెస్టోతో మభ్యపెట్టే యత్నం

- మేము ఈ ఐదేళ్లలో చేసిన పనులే తాను కూడా చేస్తానని చెప్పుకుంటున్నాడు..
- చెప్పుకోవటానికి ఒక్క మంచి కూడా లేకే ఈ దుస్థితి
- యరపతినేనిపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం తాము ప్రకటించిన మేనిఫెస్టోను యరపతినేని శ్రీనివాసరావు కాపీ చేసి ప్రజలను మభ్యపెట్టే యత్నాలు చేస్తున్నాడని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. యరపతినేని ఒక్క మంచి పనికూడా చేయకపోవటం వలనే చెప్పుకోవటానికి ఏమిలేక మేము చేసే పనులనే తాను కూడా చేస్తానని ఉదర గొడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ దాచేపల్లి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాసు మాట్లాడారు. 2019 ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99శాతం తాను నేరవేర్చానని గుర్తు చేశారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన యరపతినేని ఒక్కసారి కూడా మేనిఫెస్టోను విడుదల చేయలేదని, మేము విడుదల చేసిన తరువాత వాటిలో చిన్నచిన్న మార్పులు చేసి మా మేనిఫెస్టోనే ఆయన మ్యానిఫెస్టోగా కాపీ చేసి చెప్పుకుంటున్నారన్నారు. తాను ఈ పని చేస్తాను అని ప్రజలకు చెప్పుకునే దమ్ము యరపతినేనికి లేదన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల దెబ్బకి భయపడి ఉత్తుత్తి మేనిఫెస్టోని విడుదల చేసి పబ్బం గడుపుకొంటున్నారని ఎమ్మెల్యే కాసు అన్నారు.

**అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు కళ్లరా చూస్తున్నారు..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు కళ్లరా చూస్తున్నారని ఎమ్మెల్యే కాసు అన్నారు. పిడుగురాళ్ల బైపాస్ రోడ్డు పనులు, జానపాడు రైల్వే బ్రిడ్జి, బ్రాహ్మణపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇంటింటికీ కృష్ణా జలాలు ఇలా మేము చేసిన అభివృద్ధి చెప్పుకోవటానికి చాలా ఉందని, కానీ యరపతినేనికి ఒక్కటి కూడా లేదని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అభివృద్ధి పనులు చేస్తాయని, రాష్ట్రం నుంచి పన్నులు కేంద్రానికి చెల్లిస్తున్నప్పుడు అభివృద్ధిలో కేంద్రం సహకారం తీసుకుంటే తప్పేముందని ఆయన ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మేం చేసిన పనులు చెప్పుకుంటుంటే యరపతినేని ఏడుస్తున్నాడని ఆయన అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన యరపతినేని, ఆయన కుటుంబ సభ్యులు మినరల్ వాటర్ తాగుతున్నారని, నియోజకవర్గంలోని ప్రజలు మాత్రం బోరు నీళ్లు తాగుతున్నారని ఎమ్మెల్యే కాసు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు కృష్ణా జలాలు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు అందిస్తామని ఎమ్మెల్యే కాసు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మునగా పున్నారావు, పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభాని, కోట కృష్ణ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కందుల జాను, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ తదితరులున్నారు.

**ఫల్వరైజర్స్‌పై కేసులు పెట్టించిందే యరపతినేని..**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పిడుగురాళ్లలోని ఆర్యవైశ్యులు, ఫల్వరైజర్స్ మీద కేసులు పెట్టించి, ఫైన్ వేయించింది యరపతినేని అని, యరపతినేని ధన దాహానికి అమయాకులు బలయ్యారని ఎమ్మెల్యే కాసు చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు కేసులు ఎత్తివేయించకుండా , అధికారంలోకి వచ్చిన తరువాత కేసులు ఎత్తివేయిస్తామని మోసపూరితమైన మాటలు యరపతినేని మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కాసు అన్నారు. యరపతినేని అక్రమ మైనింగ్ చేస్తే, అయామకులైన ఫల్వరైజర్స్‌పై కేసులు పెట్టారని, జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం అయిన వెంటనే ఆర్యవైశ్యులు, ఫల్వరైజర్స్‌పై పెట్టిన కేసులు ఎత్తివేయిస్తామని ఎమ్మెల్యే కాసు చెప్పారు.

# గ్రామాల్లో పోలీసు కవాతు

రెంటచింతల: మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రెంటచింతల, రెంటాల, మంచికల్లు, మిట్టగుడిపాడు గ్రామాలలో ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి నేతృత్వంలో బీఎస్ఎఫ్ దళాలు శనివారం కవాతు నిర్వహించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని ఎస్ఐ నారాయణరెడ్డి కోరారు.

గురజాల: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్‌ను శనివారం నిర్వహించారు. మండల పరిధిలోని సమాధానంపేట, గొట్టిముక్కల, దైద, తేలుకుట్ల గ్రామాల్లో పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ పల్లపురాజు ఆధ్వర్యంలో సీఐ బాలకృష్ణ సారథ్యంలో ఎస్ఐలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు.

## పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ

పిడుగురాళ్ల : పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక శనివారం పిడుగురాళ్లలో జరిగింది. మండల అధ్యక్షుడిగా బత్తుల దేవదాసు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎర్రం శేఖర్, జనరల్ సెక్రటరీగా పోలేపల్లి లాజర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు జిల్లా అధ్యక్షుడు జి.జయప్రకాశ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ప్రతి ఒక్కరూ ఫెలోషిప్ అభివృద్ధి పరిచే విధంగా ఉండాలన్నారు. నూతన కమిటీ నియామకంపై పలువురు పాస్టర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రెసిడెంట్ చందాల మరియదాసు, తదితరులున్నారు.

# షంషాద్ బేగం సేవలు మరువలేనివి



ఉపాధ్యాయురాలు షేక్ షంషాద్ బేగంను సత్కరిస్తున్న ఎంఈఓ సురేష్, ఉపాధ్యాయులు

దుర్గి: ఉత్తమ ఉపాధ్యాయురాలు షేక్ షంషాద్ బేగం సేవలు పల్నాడు ప్రజలు మరువలేరని విద్యాశాఖాధికారి అల్లి సురేష్ కొనియాడారు. శనివారం మండల కేంద్రమైన జెడ్పీహెచ్ పాఠశాలలో షంషాద్ బేగం ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో 26సంవత్సరాల పాటు విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి, ఈ ప్రాంత అభివృద్ధిలో షంషాద్ బేగం చేసిన సేవలు మరువలేనివన్నారు. హెచ్ఎం పి.కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోలా మల్లిఖార్జున రావు, జి.చిన అనంతరామయ్య, శివానంద్, హనుమంతరావు, కరీమ్ తదితరులున్నారు. అనంతరం బేగం తనయుడు డాక్టర్ షేక్ ఉమర్‌ను ఘనంగా సత్కరించారు.

## ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాసు



దాచేపల్లి: నగర పంచాయతీలో శనివారం జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక జామియా మసీద్‌లో జరిగిన ప్రత్యేక నమాజ్‌లో ఎమ్మెల్యే కాసు పాల్గొన్నారు. ముస్లింలను ఆత్మీయంగా పలకరించారు. అనంతరం పలుచోట్ల ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే కాసు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పార్టీ పట్టణ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, నాయకులు షేక్ ఖాదర్‌బాషా, షేక్ సైదా, మున్నా, జానీబాషా, మహ్మద్‌జానీ, డాడీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రసన్నాంజనేయ ప్రతిష్ఠా మహోత్సవం



ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న పీవీఆర్

మాచర్ల: పట్టణంలోని 31వ వార్డులోని వినాయకునిగుట్ట కాలనీలో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం నిర్వహించారు. ఉదయం నుంచి ధ్వజస్తంభ ఏర్పాటు, ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి, ధ్వజస్తంభ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(పీవీఆర్) ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభం వద్ద పూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు పోలా శ్రీను, కౌన్సిలర్ దస్తగిరి, ఆత్మకూరి పూర్ణచంద్రరావు, వార్డుకు చెందిన పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి జయంతి



రాజుపాలెం: మండలంలోని ఆకుల గణపవరంలో ప్రసన్నాంజనేయస్వామి 95వ జయంతి మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సామూహిక లక్ష తమలపాకుల పూజలు, సిందూర పూజలను పలువురు దంపతులు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శ్రీనివాసుల హనుమంత్ దీక్షితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రథంపై స్వామివారిని గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నవోదయ పాఠశాలకు చెందిన విద్యార్థుల కోలాటం చూపరులను ఆకట్టుకుంది.

## అక్రమ మద్యం స్వాధీనం



రెంటచింతల: మండలంలోని తుమృకోట గ్రామంలో గురజాల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, నర్సరావుపేట డీటీఎఫ్, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా నిర్వహించిన దాడులలో ఓ వ్యక్తి నుంచి అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు గురజాల ఎన్ఫోర్స్మెంట్ సీఐ వెంకట రమణ శనివారం తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టామన్నారు. గ్రామానికి చెందిన వి.వెంకట సైదేశ్వరరావు తన నివాసంలో అక్రమంగా మద్యం విక్రయిస్తూ ఉండగా అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి డ్యూటీ పెయిడ్ 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 35, నాన్ డ్యూటీ పెయిడ్ 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 15, 90 ఎంఎల్ మద్యం బాటిళ్లు 23 స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి గురజాల కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.